

ఊబకాయంతో ముప్పే - ఆందోళన కలిగిస్తున్న ఒబెసిటీ 8
భక్తుల మనోభావాలను గౌరవించేందుకు చర్యలు 7



జిల్లా ఆసుపత్రిలో జ్వర పీడితులు

వానాకాలం.. వ్యాధుల కాలం

- జిల్లాలో సీజనల్ వ్యాధుల దడ
- వెంటాడుతున్న డెంగ్యూభయం
- దోమలతో సతమతం
- ఈ నెలలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో 2072 మంది జ్వరపీడితులు
- ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రతి రోజు వెయ్యి మందికిపైగా జ్వర బాధితులు
- క్లోరినేషన్, పారిశుధ్యంపై దృష్టి పెట్టిన పంచాయతీ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సీజనల్ వ్యాధులు కలవరపెడుతున్నాయి. వానాకాలం మొదలవడంతోనే వాతావరణంలో మార్పులు వచ్చాయి. దీంతో జిల్లాలో జ్వరపీడితులు పెరుగుతున్నారు. ప్రతీరోజు వెయ్యి మందికి పైగా జ్వరంతో బాధపడుతూ ప్రైవేటు అసుపత్రుల్లో చికిత్స కోసం వస్తున్నారు. ఈ నెలలో ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే 2072 మంది జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందారు. జిల్లాలో చాలా మంది వైరల్ జ్వరాలతో పాటు మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ లక్షణాలతో బాధ పడుతున్నారు. ఏటా డెంగ్యూ కేసులు కూడా నమోదవుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఈ సంవత్సరం మూడు డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా డెంగ్యూ కేసులు వస్తున్నాయి. వైరల్ జ్వరాలతోపాటు డెంగ్యూ భయం కూడా వెంటాడుతోంది. వైరల్ జ్వరాల్లో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందిన వారి సంఖ్య చూస్తే తంగళ్లపల్లిలో 102 మంది, నేరెళ్లలో 62 మంది, చీర్లవంచలో 90 మంది, కోనరావుపేటలో 96 మంది, ఇల్లంతకుంటలో 81 మంది, లింగన్నపేటలో 128 మంది, పోత్గల్‌లో 48 మంది, ఎల్లారెడ్డిపేటలో 107 మంది హనుమాజీపేటలో 71 మంది, చందుర్తిలో 49 మంది, బోయినపల్లిలో 84 మంది, విలాసా గర్‌లో 87 మంది, కొదురుపాకలో 16 మంది, సిరిసిల్ల పీఎస్‌నగర్‌లో 93 మంది, సిరిసిల్ల ఎబీ నగర్‌లో 52 మంది, జిల్లా ఆసుపత్రిలో 677 మంది, వేములవాడ ఏరియా ఇసుపత్రిలో 58 మంది, గంభీరావుపేటలో 87 మంది, వేములవాడ బస్తీ దవాఖానాలో 30 మంది, రాజీవ్‌నగర్ బస్తీ దవాఖానాలో 57 మంది జ్వరంతో బాధపడుతూ చికిత్స పొందారు. జిల్లాలో ప్రతీ ఊరికి వెళ్లినా జ్వరాలతో బాధపడుతున్నవారు ఉన్నారు.



వీర్నపల్లిలో దోమల మందు స్ప్రేచేయిస్తున్న వైద్య సిబ్బంది

● దోమల నియంత్రణే మార్గం

ప్రస్తుతం దోమల నియంత్రణకు అనేక రకాల స్ప్రేలు, లిక్విడ్‌లు, కాయిల్స్ అందుబాటులోకి వచ్చాయి. వాటికి కూడా దోమలు లొంగి పోవడం లేదు. ఎలక్ట్రానిక్ బ్యాట్‌ల ద్వారా కూడా చంపే పరిస్థితి ఇళ్లలో కనిపిస్తోంది. దోమతెరలు ఉపయోగించుకుంటున్నారు. చివరకు ఆరుబయట కూర్చునే కుర్చీల వద్ద కూడా నెట్‌లు ఏర్పాటు చేసుకోవడం పరిపాటిగా మారింది. దోమల నివారణ కోసమే ప్రతీ ఇంట్లో ప్రతీ నెల రూ.200 వరకు ఖర్చు చేస్తున్నారు. దోమ కాటు వల్ల వచ్చే జబ్బులకు వేలల్లోనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఒకప్పుడు దోమలు కంటికి కనిపించక పోయినా ఇప్పుడు ఆడ, మగ దోమలను కంటితోనే నిర్ధారించే సైజుల్లో మనుషులపై దాడి చేస్తున్నాయి. రెండు వారాల జీవిత కాలం లేని దోమను నియంత్రించడం కోసం అనేక పాట్లు పడుతూనే ఉన్నారు.

● టైగర్ దోమలతో వచ్చే డెంగ్యూ

పగలు కుట్టే టైగర్ దోమలు ప్రమాదకరమైనవి. ఎడిస్ ఈజిప్ట్ అనే దోమలు కుట్టడం వల్ల శరీరంలోకి నాలుగు రకాల వైరస్‌లు చేరుతాయి. దీనివల్ల డెంగ్యూ జ్వరం, డెంగ్యూ హెమ రైజిడ్, డెంగ్యూ షాకొసింద్రమ్ వంటి మూడు రకాల వ్యాధులు వస్తాయి. ఈ జ్వరం ఉంటే శరీరం ఎర్రగా కందిపోతుంది. కీళ్లు కండరాలు ఒళ్లునొప్పులు ఉంటాయి. కళ్లు కదిలించలేనంతా మూతలు పడుతాయి. వాంతులు అవుతాయి. ఈ లక్షణాలు కనిపిస్తే పూర్తిగా వైద్యుడి సంరక్షణలో వైద్యం చేయించాలి.

● మెదడువాపుతో జాగ్రత్త

కులెక్స్ దోమతో ఐదేండ్లలోపు వారికి వైరస్ సోకి ఆరు రోజుల్లోనే లక్షణాలు బయటపడుతాయి. కండ్లు తిరగడం, జ్వరం రావడం, అపస్మారక స్థితిలోకి చేరడం రోగి వంకరలు తిరగడం, మెదడు వాపు లక్షణాలుగా భావించాలి.పూర్తిగా ఆసుపత్రిలో ఉంచి చికిత్స చేయాలి. పందులను నివాస గృహాల వద్ద తిరగనివ్వక పోవడం ఎంతో మంచిది.

● హడలెత్తిస్తున్న దోమలు



ఒకప్పుడు దోమలు కంటికి కనిపించేవి కావు. ఇప్పుడు ఏ రకమైన దోమ అయినా కంటికి కనిపించేవిగా ఉంటున్నాయి. టైగర్ దోమలు విజృంభిస్తూ డెంగ్యూ జ్వరానికి కారణమవుతున్నాయి. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, మున్సిపాలిటీలతోపాటు మండలాల్లో దోమలు పెరిగిపోయాయి. దోమల వల్ల రాత్రి వేళల్లో కాకుండా పొద్దంతా కిటీకీలు వేసుకోని ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. జిల్లాలో ప్రజలు దోమలతో హడలెత్తి పోతున్న క్రమంలో పారిశుధ్యంపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు.

● చలి జ్వరాలు

దోమ కాటుతో చలి జ్వరాలతో ఎక్కువ సంఖ్యలో బాధ పడుతున్నారు. మాస్టర్ ఫీవర్, రోమన్ ఫీవర్, ఇంటర్ మిటెంట్ ఫీవర్, ట్రాఫికల్ ఫీవర్, కోస్టల్ ఫీవర్ ఇలా రకరకాల పేర్లతో వచ్చే చలిజ్వరాన్ని తెచ్చే దోమలను చూస్తే వామ్మో అనాల్సిందే. ప్రధానంగా మలేరియా జ్వరం అందరినీ బాధిస్తున్న సమస్య. మలేరియాతో వేల సంఖ్యలో శిశువులు మృత్యువాత పడుతుంటే ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా దాదాపు 20లక్షల మంది వరకు దోమ కాటుతో వచ్చే మలేరియా, ఇతర జ్వరాలకు బలవుతున్నారు. రక్తాన్ని పీల్చి చాలా వ్యాధులకు కారణమైన కీటకాలు అనేకం ఉన్నాయి. అందులో ముఖ్యంగా మూడు రకాల దోమలు వ్యాధులకు పని చేస్తున్నాయి. అవి కుల్సిడే కుటుంబానికి చెందిన క్యూలెక్స్, అనాపిలస్, ఇడిస్ దోమలు ఇవి మనుషుల మీద బాహ్య పరాన్న జీవులుగా బతుకుతాయి. అనాపిలస్ జాతికి చెందిన ఆడ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి వస్తుంది. దోమ కుట్టినప్పుడు రక్తంలో ఉన్న మలేరియా వ్యాధిని కలిగించే ప్లాస్మాడియం సూక్ష్మ జీవులు దోమ జీర్ణకోశంలో చేరి అక్కడ అనేక మార్పులు చెంది స్పోరో జూయిట్లుగా మారి తిరిగి దోమ లాల జలంలోకి చేరుతుంది. ఆ దోమ ఆరోగ్యవంతుడైన మనిషిని కుట్టినప్పుడు అవి శరీరంలోకి ప్రవేశిస్తాయి. ఇలా స్పోరో జోయిట్లు మిరో జోయిట్లుగా మారి ట్రోపో జోయిట్లుగా అభివృద్ధి చెందుతాయి. మనిషి రక్త కణాల మీద దాడి చేసినప్పుడు లక్షణాలు బయట పడుతాయి. దోమ కుట్టిన 31వ రోజు లోపు మలేరియా జ్వర లక్షణాలు బయట పడుతాయి. మూడు దశల్లో మలేరియా కనిపిస్తుంది. మలేరియా ప్రారంభంలో ఒల్లు వేడి, చలి వణికిస్తుంది. రెండవ స్టేజీలో జ్వరం తీవ్రంగా ఉండి ఒకటి నుంచి 4గంటల పాటు ఉంటుంది. మూడవ దశలో విపరీతంగా చెమటలతో జ్వరం దిగి పోతుంది. కొన్ని సందర్భాల్లో ఈ మూడు దశలు కూడా కనిపించక పోవచ్చు. ప్లాస్మాడియం వైవాక్స్ సూక్ష్మ జీవి వల్ల 48గంటలకు ఒక సారి జ్వరం వస్తుంది. రెండు రోజులకు ఒక సారి విడువ కుండా బాధపెడుతుంది. ప్లాస్మాడియం మలేరియా అనే సూక్ష్మజీవి వల్ల 72గంటలకు ఒక సారి జ్వరం వస్తుంది. ప్లాస్మాడియం పాల్సీ పారం వల్ల కొన్ని ఇబ్బందులు పెడుతుంది. చలి పెద్దగా ఉండదు. జ్వరం మాటి మాటికి వస్తుంది. ఎక్కువ సేపు ఉండడం గుండె నిదానంగా కొట్టుకుంటుంది. సెరీబ్రల్ మలేరియా వచ్చి మరణానికి దారి తీసే అవకాశాలు ఉంటాయి. అనేక లక్షణాలు మనకు కనిపిస్తుంటాయి. చలి జ్వరం వచ్చినప్పుడే రక్త పరీక్ష చేసి మలేరియాను నిర్ధారించి చికిత్స చేసుకోవడం ఎంతో మంచిది. దోమల వల్ల మలేరియానే కాకుండా బోదకాలు, డెంగ్యూ జ్వరం కూడా వస్తుంది.

నివారణతో వ్యాధులు దూరం

- డాక్టర్ సుమన్‌మోహన్‌రావు, జిల్లా వైద్యాధికారి



జిల్లాలో దోమలు పెరుగుతున్నాయి. దోమలు నివారించుకోవడం వల్ల వ్యాధుల నుంచి దూరంకావచ్చు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు చేపట్టాం. జ్వరం వస్తే రక్త పరీక్షలు చేయించుకోవాలి. దోమలు నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఉంటాయి. నీరు నిల్వ ఉండకుండా, చెత్తా చెదారం నిల్వ ఉండకుండా చూసుకోవాలి. పూల కుండీల్లో నిల్వ ఉండే నీరు కూడా దోమలు పెరగడానికి ఉపయోగపడుతాయి. ఎప్పటికప్పుడు నీటిని తీసివేయాలి. కుండికి చిన్న కన్నం వేసి పంపించడం మంచిది. సెప్టిక్ ట్యాంక్‌ల నుంచి దుర్వాసన పోయే గొట్టాలకు మాస్క్ బిగించాలి. పాత టైర్లు, తాటి పారేసిన కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ టీ కప్పులు దూరంగా పడవేయాలి. ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు ఉంటాయి. వర్షం పడ్డప్పుడు నీరు నిలుస్తుంది. దోమలు ఇక్కడ ఎక్కువగా పెరుగుతాయి. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలి.

విద్యాభివృద్ధికి పెద్దపీట



డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

చందుర్తి, జూన్ 30 : విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం నర్సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా నిర్మాణం చేపట్టిన డైనింగ్ హాల్‌ను ఆదివారం ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో పాఠశాలల అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. ఎంపీపీ బైరవని లావణ్య రమేష్, జడ్పీటీసీ నాగం కుమార్, జోగాపూర్ ఎంపీటీసీ గణేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చింతపంటి రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేసే అవకాశం



వైస్ ఎంపీపీని సన్మానిస్తున్న గ్రామస్థులు

ఇల్లంతకుంట, జూన్ 30: ప్రజలకు సేవచేసే అవకాశం కల్పించిన వంతడుపుల, రహీంఖాన్‌పేట గ్రామస్థులకు వైస్ ఎంపీపీ సుదగోని శ్రీనాథ్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. వంతడుపుల గ్రామంలో ఆదివారం అంబేద్కర్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీటీసీ పరిధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషిచేయడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు మద్కాడి రాములు, ఉపాధ్యక్షుడు నల్లగొండ శంకర్, నాయకులు ఎదిరె రాములు, సావనపెల్లి లక్ష్మణ్, బడుగు బాబు, ఎలుక అంజయ్య, వంశీ, రాజయ్య, సుదగోని శ్రీనివాస్, కొమ్మెర రాజిరెడ్డి, దొమ్మాటి అనీల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యాలయ శిలాఫలకం ధ్వంసం



రంగంపేటలో ధ్వంసమైన శిలాఫలకం

ఇల్లంతకుంట, జూన్ 30: మండలంలోని రంగంపేట గ్రామపంచాయతీ కార్యాలయ శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. గ్రామస్థులు ఆదివారం వెళ్లి చూసేసరికి శిలాఫలకం ధ్వంసమై కనిపించింది. దీనితో గ్రామానికి చెందిన మేడిపల్లి భాస్కర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితులను గుర్తించి శిక్షించాలని కోరాడు. మండలంలోని రంగంపేట, పండలాపూర్ గ్రామాలను కలిపి ఐదు సంవత్సరాల క్రితం గ్రామపంచాయతీగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. గ్రామపంచాయతీ కార్యాలయం ఎక్కడ నిర్మించాలనే విషయంపై ఇరు గ్రామాల ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చారు. ఇరు గ్రామాల మధ్యలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో నిర్మించాలని నిర్ణయించారు. గత ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. భవన నిర్మాణం పూర్తయ్యే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో ప్రారంభోత్సవం నిలిచిపోయింది. కార్యాలయాన్ని ప్రారంభించాలని ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో శనివారం ప్రారంభోత్సవం చేశారు. ప్రారంభోత్సవ సమయంలో వివాదాలు జరుగకపోయినప్పటికీ తెల్లవారేసరికి శిలాఫలకం ధ్వంసమై కనిపించింది. ఈ పని ఎవరు చేశారని పోలీసులు విచారణ చేపట్టారు.

మైనర్లు వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు

వేములవాడ టౌన్, జూన్ 30: మైనర్లు వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, మైనర్ల బాధ్యత తల్లిదండ్రులే వహించాలని డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. వేములవాడ పట్టణంలోని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ 103, విత్ ఔట్ డ్రైవింగ్ లైసెన్స్ 194, సెల్‌ఫోన్ డ్రైవ్ 156, విత్ ఔట్ నెంబర్ ప్లేట్ 241, డ్రంక్ అండ్ డ్రైవ్ 124, విత్ ఔట్ హెల్మెట్ 280 కేసులు నమోదు చేశామని అన్నారు. నెంబర్ ప్లేట్ ట్యాపరింగ్ చేసిన, సగం నెంబర్ ప్లేట్ కలిగి ఉన్న వాహనదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే, మీ ప్రాణాలతోపాటు ఇతరుల ప్రాణాలు సైతం ప్రమాదంలో పడుతాయని అన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే మైనర్లతోపాటు వాహనాల యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, వాహనాలకు నెంబర్ ప్లేట్ లేకపోవడం, నెంబర్‌ప్లేట్ ట్యాపరింగ్ చేయడం, సగం నెంబర్ ప్లేట్ కలిగి ఉండడం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని వివరించారు.

రక్తదాన శిబిరం

రుద్రంగి, జూన్30 : రుద్రంగి మండల కేంద్రంలో రుద్రంగి బ్లడ్ డోనర్స్, సిరిసిల్ల సివిల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో మండలానికి చెందిన యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రుద్రంగి బ్లడ్ డోనర్స్ సభ్యులు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు రక్తం దొరకడం లేదన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, రక్తదానంతో ఒకరి ప్రాణం నిలపవచ్చని అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద పల్లె దవాఖానాలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 50 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని తెలిపారు.

మార్కెట్ యార్డు ఏర్పాటు చేయాలి

చందుర్తి, జూన్ 30: చందుర్తి మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డును ఏర్పాటు చేయాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను రామన్నపేట ఎంపీటీసీ వేల్పుల వనజ-దేవస్వామి ఆదివారం కోరారు. చందుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. యార్డును ఏర్పాటు చేస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఆది శ్రీనివాస్

చందుర్తి, జూన్ 30 : ప్రభుత్వం మారింది ప్రజాపాలన తీసుకురావాలని, ప్రజలకు అందుబాటులో ఉండి పనులు చేయాలని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బైరగోని లావణ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి అతిథులుగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 45 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు రాజకీయ జన్మనిచ్చిన చందుర్తి మండలంతో విడదీయలేని అనుబంధం ఉందన్నారు. నాడు ఇదే సభలో ఎంపీటీసీ సభ్యుడిగా ఉన్న తాను 18 సంవత్సరాల అనంతరం శాసనసభ్యుడి హోదాలో కూర్చుండడం మరుపురాని అనుభూతిని ఇచ్చిందన్నారు. అనునిత్యం ప్రజాసేవలో ఉంటూ ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకున్నట్లయితే అదే ప్రజల దీవెనలతో చట్టసభల్లో ఉండవచ్చన్నారు. విమర్శలు, ప్రతి విమర్శలు ఎన్నికల సమయాలలోనే ఉంటాయని, మండల అభివృద్ధిలో అందరి సలహాలు తీసుకుంటానని అన్నారు. చందుర్తి ప్రజల చిరకాల వాంఛ చందుర్తి మోత్కురావుపేట రోడ్డు అటవీశాఖ అనుమతులు రానున్నాయన్నారు. పది, పదిహేను రోజులలో పనులు ప్రారంభించి, వర్షాకాలం ముగియగానే ఆ రోడ్డు పనులు పూర్తి చేస్తామన్నారు. మండల కేంద్రంలోని 54 సర్వే నెంబర్‌లో గల 45 గుంటల భూమిలో 20 గుంటల స్థలాన్ని ఎస్సీ హాస్టల్ భవన నిర్మాణానికి, మిగతా స్థలాన్ని గ్రామంలోని భూమిలేని నిరుపేదలకు అందజేసి, ఇందిరమ్మ ఇల్లు పథకం కింద ఒక్కొక్కరికి ఐదు లక్షల చొప్పున అందజేస్తామన్నారు. మండలంలోని అంతర్గత రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణాలు, ఇతర సమస్యలు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. అధికారులు పాజిటివ్ మూడ్‌లో ఉండాలన్నారు. దరఖాస్తు రాగానే పెండింగ్‌లో లేకుండా పనిచేయాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు రెవెన్యూ శాఖ అధికారులు 24 గంటల్లో సర్టిఫికెట్లు అందజేయాలని సూచించారు. పైస్థాయి అధికారులతో మీటింగ్‌లలో ఉన్నానని ఆలస్యం చేయవద్దన్నారు. వివిధ శాఖల అధికారులతో సమన్వయంతో కలిసి పనులు చేయాలన్నారు. సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులకు ఇచ్చే ప్రగతి నివేదికల్లో తప్పులు ఉండవద్దన్నారు. పూర్తిస్థాయి సమాచారంతో నివేదికను ఇవ్వాలని సూచించారు. జూలై 4న జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం ముగిస్తున్నందున ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో సభ్యులను శాలువా, మెమోంటోతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ, జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కుమార్, సింగిల్ విండో చైర్మన్లు కిషన్ రావు, తిప్పని శ్రీనివాస్, పొన్నాల శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, వివిధ అధికారులు పాల్గొన్నారు.

ఆటలు ఆడేదెలా?



రాచర్లగొల్లపల్లిలోని క్రీడా ప్రాంగణం



క్రీడా ప్రాంగణంలో ఒరిగిన పరికరాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 30: గ్రామాల్లోని విద్యార్థులు, యువత ఆటల్లో రాణించాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం పల్లెల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఆట వస్తువులను సమకూర్చింది. అధికారుల పర్యవేక్షణ లేక ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామ శివారులోని క్రీడా ప్రాంగణంలోని పరికరాలు వంగిపోయాయి. ప్రాంగణం సమీపంలో ధాన్యం కొనుగోళ్లను చేపట్టడంతో రైతులు మైదానంలో ధాన్యంపై కప్పిన కవర్లు కొట్టుకుపోకుండా ఉండేందుకు తీసుకు వచ్చిన బండరాళ్లను అలాగే వదిలేశారు. ఓ వైపు క్రీడా పరికరాలు వంగిపోవడం.. మరో వైపు మైదానంలో రాళ్లు పడి ఉండడంతో ఆటలు ఆడేందుకు ఆటంకం ఏర్పడుతోందని క్రీడాకారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని, క్రీడా ప్రాంగణంలోని పరికరాలను సరి చేసి ఆటలు ఆడుకునేందుకు వీలుగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు




ఇల్లంతకుంటలో బోనాలతో మహిళలు, సిరిసిల్లలో బోనమెత్తుకున్న మహిళలు

సిరిసిల్ల టౌన్ జూన్ 30: వర్షాలు సమృద్ధిగా కురిపించు.. పిల్లాపాపలను సల్లంగా చూడు పోచమ్మ తల్లి అంటూ మహిళలు బోనం ఎత్తుకొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం 15వ వార్డు కౌన్సిలర్ ఆకునూరి విజయనిర్మల బాలరాజు ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. వార్డు మహిళలు అంబేద్కర్ చౌరస్తా నుండి పోచమ్మ దేవాలయం వరకు బోనాలు ఎత్తుకొని దేవాలయంలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, వార్డు నాయకులు, మహిళలు యువకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోణాలను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుల్లు, శివసత్తుల పూనకాల మధ్య మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా సకాలంలో వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండాలని వేడుకున్నట్లు సంఘ నాయకులు తెలిపారు.

● **వడుకాపూర్‌లో మడేలేశ్వరస్వామి బోనాలు..**

జూలపల్లి: మండలంలోని వడుకాపూర్‌లో ఆదివారం రజక కులస్తుల ఆధ్వర్యంలో వారి ఆరాధ్యదైవమైన మడేలేశ్వరస్వామి బోనాల వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మడేలేశ్వరస్వామి వేడుకలను పురస్కరించుకుని మహిళలు ఉపవాస దీక్షలతో స్వామి వారికి నైవేద్యం సమర్పించేందుకు డప్పుచప్పుల్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లారు. ఆయలయంలో స్వామివారికి బెల్లం సాకం, నైవేద్యం, సమర్పించి తమ పిల్లాపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. వైస్ ఎంపీపీ మొగురం రమేష్, మాజీ సర్పంచ్ దారబోయిన నర్సింహయాదవ్ పాల్గొని బోనాలతో ఆలయానికి తరలివెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రజక కుల నాయకులు ఎర్రోల్ల రాములు, కూనరాజుల లచ్చన్న, కూనరాజుల రాజన్న, కూనరాజుల శంకరయ్య, మల్లయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



వడుకాపూర్‌లో..

రోడ్డుపైనే మురుగు నీరు.. ఇళ్లలోకి విషపురుగులు

- ఇబ్బందిపడుతున్న ప్రజలు - భయాందోళనలో కాలనీవాసులు




మల్లాపూర్‌లో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీటిలో నుంచి నడుచుకుంటు వెళుతున్న స్థానికులు, పేరుకుపోయిన మురుగు

తిమ్మాపూర్, జూన్ 30: మండలంలోని మల్లాపూర్ గ్రామంలోని 5వ వార్డులో మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామం ప్రారంభం నుంచి శివారు గుట్ట ప్రాంతం వరకు డ్రైనేజీని నిర్మించారు. అయితే గత పాలకుల అధికారుల సహాయంతో స్థానికంగా ఉన్న కొంత వ్యవసాయ భూమిని కొందరు ప్లాట్లుగా చేసి ఎలాంటి నాలా అనుమతులు లేకుండానే విక్రయించారు. అనంతరం ప్లాట్లను కొనుగోలు చేసిన వారు అందులో ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలో కొనుగోలు చేసిన ప్లాట్లు రోడ్డుకు చాలా లోతుగా ఉండటంతో రోడ్డుకు ఎత్తుగా మట్టితో పూడ్చుతున్నారు. గతంలో మురుగు నీరు అంతా ఓ ఖాళీ ప్రదేశానికి తరలించేవారు. అయితే ప్రస్తుతం ఇళ్ల నిర్మించుకోవడంతో మురుగు నీరు బయటకు వెళ్లకుండా అడ్డుగా మట్టి పడటంతో రోడ్ల మీద ప్రవహిస్తున్నాయి, దీనికి తోడు ఇప్పుడు వర్షాలు కూడా కురుస్తుండటంతో మురుగు నీరు, వర్షం నీరు కలిసి రోడ్ల మీద నుండి ప్రవహించడమే కాకుండా ఇళ్లలోని వచ్చి చేరుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. నెలల తరబడి నీరు నిలిచి ఉండటంతో స్థానికంగా దుర్గంధం, దోమల కారణంగా విషజ్వరాలు వస్తున్నాయని అంటున్నారు. అంతేకాకుండా ఇళ్లలోని విష క్రిమికీటకాలు, చెత్త ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని భయంతో కాలం వెళ్లదీస్తున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. దీనిపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకునే వారే లేరని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఐదో వార్డులో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించి ఆదుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు, వర్షపు నీరు

అధికారులు పట్టించుకోవడం లేదు

- హరికృష్ణ, మల్లాపూర్ గ్రామం



మల్లాపూర్‌లోని ఐదో వార్డులో ఉన్న సమస్యలపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. వ్యవసాయ భూమిని ఎలాంటి నాలా పర్మిషన్ లేకుండానే విక్రయించి ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఆ ప్లాట్లు రోడ్లుకు లోతుగా ఉండటం వల్ల కిందికి మురికి నీరు వెళ్లకుండా నిలిచిపోయి రోడ్ల పైకి, ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం అయింది. మురికి కాలువ నీరు, వర్షపు నీరు కలిసి ఇళ్లలోకి వస్తున్నాయి. పాములు, కప్పలు, చెత్త ఇళ్లలోకి చేరి దుర్గంధం, దోమలతో ఉండలేకపోతున్నాం. అధికారులకు చాలాసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలి.

ముదిరిన పోడుభూమి వివాదం

- ఇరువర్గాల మధ్య ఘర్షణ

వీర్నపల్లి, జూన్ 30: పోడు భూముల వివాదం ఇరువర్గాల గిరిజనుల మధ్య ఘర్షణకు దారితీసింది. ఇరువర్గాలు కర్రలతో, రాళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోగా తలలు పగిలి ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన వీర్నపల్లి మండలం భూక్యతండా పరిధిలోని రాసిగుట్ట తండా అటవీ భూముల్లో ఆదివారం సాయంత్రం జరిగింది. అదే గ్రామానికి చెందిన భూక్య సరియా నాలుగెకరాలు, లకావత్ వసంత్ 1.20 ఎకరాలు సాగు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం వీరికి పోడు పట్టాలను అందించింది. ఇద్దరికి సరిహద్దు విషయంలో కొంతకాలంగా గొడవలు జరుగుతుండగా గ్రామస్థులు హద్దులను చూపించినా వివాదం సద్దుమనగలేదు. ఆదివారం లకావత్ వసంత్ ఆయన కుమారులు రవి, తిరుపతి, భూక్య సరియా ఆయన కుమారుడు నవీన్, తమ్ముడు మోహన్ సాగు చేసుకుంటున్న భూముల వద్దకు వెళ్లి హద్దుల విషయంలో మాటమాట పెరగడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దాడిలో వసంత్, తిరుపతి, నవీన్ తీవ్రంగా గాయపడ్డారు. ఇరువర్గాలు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు చేరుకోవడంతో చికిత్స నిమిత్తం పోలీసులు ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల నుంచి ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రమేష్ తెలిపారు.

దుర్గామాత ఆలయంలో చోరీ



జాగిలాలతో తనిఖీలు చేస్తున్న పోలీసులు

చందుర్తి, జూన్ 30: చందుర్తి మండల కేంద్రం శివారులోని నవరత్నాల దుర్గామాత ఆలయంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. ఆలయ పూజారి మురళి రోజు మాదిరిగానే ఉదయం ఆలయం వద్దకు వెళ్లగా ఆలయం తాళం పగలగొట్టి ఉంది. వెంటనే పూజారి ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. కమిటీ సభ్యులు వచ్చి ఆలయంలోకి వెళ్లి చూడగా దుర్గామాతపై ఉండవలసిన పావు తులం పుస్తెలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జాగిలాలతో చుట్టుపక్కల గాలింపు చేపట్టారు. ఈ సంఘటనపై విచారణ జరుగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎట్టకేలకు 'సూరమ్మ' పనులు ప్రారంభం

● రు. 80 కోట్లు విడుదల చేసిన సర్కారు

● మత్తడి, తూముల పనులు వేగవంతం

కథలాపూర్, జూన్ 30: అధికార, ప్రతిపక్షాల మధ్య గడిచిన పదేళ్ల నుంచి హోరాహోరీగా సాగిన వాదనలు, నిరసనల నేపథ్యంలో ఎట్టకేలకు సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ పనులు ప్రారంభమయ్యాయి. కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ సర్కారు 80 కోట్ల రూపాయలు విడుదల చేసిన క్రమంలో కాంట్రాక్టర్ ముందుకు రావడం వల్ల పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఏళ్ళ తరబడి పనులు పెండింగ్‌లో పడిపోగా ప్రస్తుతం కొనసాగుతున్న పనులతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

● ముమ్మరమైన మత్తడి, తూముల పనులు..

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజ్ 1, ఫేజ్ 2 లో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం రు. 1,688 కోట్లతో ప్యాకేజీ కింద పనులు చేపట్టాలని నిర్ణయించింది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి సూరమ్మ చెరువును పంపింగ్ ద్వారా నింపాలని ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించారు. తెలంగాణ ఏర్పడ్డ అనంతరం నిధుల కొరత కారణంగా పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

ఈ ప్యాకేజీ పనులను ఐవీఆర్‌సీఈఎల్, ఎస్ఈడబ్ల్యు, నవయుగ కంపెనీలు సంయుక్తంగా చేపడుతున్నాయి. సూరమ్మ ప్రాజెక్టుకు సంబంధించి సబ్‌కాంట్రాక్టర్ పనులు చేపడుతుండగా నిధుల కేటాయింపులో విపరీత జాప్యం వల్ల పనులను అర్ధాంతరంగా నిలిపివేశాడు. దీంతో అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మరో వైపు బీజేపీ శ్రేణులు రకరకాల నిరసనలు చేపట్టారు.





పనులు పరిశీలిస్తున్న అధికారులు, కొనసాగుతున్న కట్ట నిర్మాణ పనులు

మేడిపల్లి, బీమారం, కథలాపూర్ మండలాల వరప్రదాయినిగా ఉన్న ఈ ప్రాజెక్ట్‌లో నీరు నిల్వ ఉంటే 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోరుట్ల దాకా భూగర్భ జలాలు వృద్ధి చెందడానికి అవకాశం ఉంది. ప్రతీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సూరమ్మ చెరువు ఓ ప్రచారాస్త్రంగా ఉండేది. తమ ప్రభుత్వం రాగానే పనులు ప్రారంభించేలా చేస్తానని ప్రస్తుత ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇవ్వగా పెండింగ్‌లో ఉన్న రు. 80 కోట్ల నిధులను విడుదల చేయించడంలో సఫలీకృతులయ్యారు.

85 మీటర్ల మేర మత్తడి, పాత తూము తొలగించి మరమ్మతుతో పాటు మరో తూము కొత్తగా నిర్మాణం చేపడుతున్నారు. సూరమ్మ చెరువు గత ఏడాది వర్షాలకు పుష్కలంగా నిండినప్పటికీ మత్తడి కోతకు గురై నీరంతా వృధాగా పోయింది.

● పనులు నిరంతరం కొనసాగిస్తున్నాం..

కార్తీక్, ఏఈ ఇరిగేషన్



ఉన్నతాధికారుల నుంచి పనులు నిరంతరం కొనసాగించాలని ఆదేశాలు రావడంతో పని ప్రదేశం వద్దే ఉండి నిరంతరం పనులు చేపడుతున్నాం. మత్తడి, తూముల నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతు న్నాయి. కుడి, ఎడమ కాలువల నిర్మాణ పనులను వెన్నా కంపెనీ సుమారు రు. 199 కోట్లతో దక్కించుకుంది. 524 ఎకరాల మేర రైతులు భూములు కోల్పోతున్నారు. నష్టపరిహారం చెల్లింపు ప్రక్రియ పూర్తయితే ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

చట్టవ్యతిరేకంగా శిశువును దత్తత తీసుకున్న దంపతులు

- శిశుగృహకు శిశువు తరలింపు, కేసు నమోదు

కరీంనగర్ క్రైం, జూన్ 30: నిబంధనలకు విరుద్ధంగా కేవలం నోటరీ చేయించుకుని ఒక శిశువును దత్తత తీసుకున్న విషయంపై కరీంనగర్ రెండో ఠాణా పోలీసులు కేసు నమోదు చేసి, ఆ శిశువును స్వాధీనం చేసుకుని సంరక్షణార్థం కరీంనగర్ శిశుగృహకు తరలించారు. బాలల సంరక్షణ సమితి అధికారులు, కరీంనగర్ రెండో ఠాణా సీఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం సంతానం లేనివారు ఎవరైనా జిల్లా బాలల సంరక్షణ సమితికి దరఖాస్తు చేసుకుని ఆ శాఖ ద్వారా పిల్లలను దత్తత తీసుకోవాల్సి ఉంటుంది. ఆ నిబంధనలు పాటించకుండా కరీంనగర్‌లోని హరిహరనగర్‌కు చెందిన ప్రైవేట్ ఉపాధ్యాయ దంపతులు వారికి సంతానం లేకపోవటంతో మాతాశిశు ఆసుపత్రిలో జన్మించిన 14 రోజుల శిశువును ఇద్దరు మధ్యవర్తుల సహకారంతో తల్లిదండ్రులతో నోటరీ రాయించుకుని దత్తత తీసుకున్నారు. దీనిపై బాలల సంరక్షణ సమితికి ఫిర్యాదు రాగా అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కరీంనగర్‌కు చెందిన ఒడ్డెపల్లి ఆంజనేయులు భార్య గొంటి మౌనికకు జనవరి 31న కరీంనగర్ మాతాశిశు ఆసుపత్రిలో ఆడ శిశువు జన్మించింది. అయితే ఆ శిశువును పోషించే స్తోమత లేదని మాతాశిశు ఆసుపత్రిలోని సెక్యూరిటీగార్డు కక్కర్ల పర్శరాంకు శిశువు తండ్రి తెలిపాడు. ఈ విషయం పర్శరాం అతని స్నేహితుడు చెరుకు రవీందర్‌రెడ్డికి తెలపగా అతడి బావ అయిన లింగాల రాజిరెడ్డి దంపతులకు చెప్పాడు. ఆ శిశువును తాము దత్తత తీసుకుంటామని మధ్యవర్తులు పర్శరాం, రవీందర్‌రెడ్డిలకు తెలపటంతో వారు శిశువు తండ్రి ఆంజనేయులుతో మాట్లాడి అడ్వకేట్ వద్ద నోటరీ రాయించుకుని శిశువును దత్తత తీసుకున్నారు. కొద్ది నెలల తరువాత ఆంజనేయులు తన కూతురు తనకే కావాలని మధ్యవర్తులను అడగడంతో ఈ విషయం బయటకు పొక్కి బాలల సంరక్షణ సమితికి ఫిర్యాదు అందింది. ఈ నెల 29న బాలల సంరక్షణ సమితి అధికారులు శిశువు దత్తత తీసుకున్న దంపతుల వద్దకు వెళ్లి విచారణ జరపగా తాము నోటరీ ద్వారా దత్తత తీసుకున్నామని తెలిపారు. శిశువు దత్తత అనేది నోటరీ ద్వారా చెల్లదని ఆ శిశువును ఆదివారం కరీంనగర్ రెండో ఠాణాకు తీసుకువచ్చారు. శిశువును సంరక్షణార్థం శిశుగృహకు తరలిస్తామని సీఐ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా శిశువును దత్తత తీసుకున్న రవిందర్, దత్తత ఇచ్చిన దంపతులు, మధ్యవర్తులపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. కాగా ఆంజనేయులు తన 14 రోజుల కూతురును దత్తత ఇచ్చేందుకు కొంత మొత్తం డబ్బులు తీసుకున్నట్లు సమచారం. మళ్లీ మరికొన్ని డబ్బులు కావాలని మధ్యవర్తులకు ఫోన్ చేసి వేధిస్తుండటంతో వారు బాలల సంరక్షణాధికారులకు ఫోన్ చేసి విషయం తెలిపారని తెలిసింది.

రాజన్న ఆలయ ఇన్‌చార్జి ఈవోగా వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, జూన్ 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయ ఇన్‌చార్జి ఈవోగా వినోద్‌రెడ్డిని నియమిస్తూ ఆదివారం దేవదాయశాఖ కమిషనర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి ఈవోగా పని చేసిన ఆర్‌జేసీ రామకృష్ణ ఆదివారం వరకు విధులు నిర్వర్తించి రిలీవ్‌పై వెళ్లారు. సికింద్రాబాద్ గణేష్ దేవాలయం ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న వినోద్‌రెడ్డిని ప్రస్తుతం రాజన్న ఆలయ ఈవోగా బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, జూన్ 30: మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలో ఆదివారం బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన తొట్ల రాజయ్య ఆముదాలపల్లి వారసంతకు కూరగాయల కోసం వెళ్లాడు. ఆముదాలపల్లి క్రాస్ వద్ద రోడ్డు పక్కకు నిల్చుని ఉన్న రాజయ్యను వీణవంక నుంచి కేశవపట్నం వైపు వెళ్తున్న బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజయ్యను 108 వాహనంలో హుజూరాబాద్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

అదుపు తప్పి ఆటో బోల్తా: వృద్ధురాలి మృతి

- ఏడుగురు ప్రయాణికులకు తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, జూన్ 30: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట లో ప్రయాణికులతో వెళుతున్న ఆటో ఆదివారం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన వృద్ధురాలు బొడ్డు చంద్రవ్వ (60) మృతి చెందింది. ఆటోలో ప్రయాణిస్తున్న రాజన్నపేట, అల్మాస్‌పూర్ వాసులు ముక్క లక్ష్మి, నమిలికొండ లావణ్య, శివరాత్రి ఇందు, స్వప్న, వాహన డ్రైవర్ బత్తుల రవితో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మరో ఏడుగురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. మండలంలోని గొల్లపల్లి గ్రామం నుంచి 15 మంది ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకుని డ్రైవర్ బత్తుల రవి అల్మాస్‌పూర్ వైపునకు బయలుదేరాడు. రాజన్నపేట గ్రామంలో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన బొడ్డు చంద్రవ్వ, రాజన్నపేటలోని తన బంధువు ముక్క లక్ష్మితో కలిసి రాజన్నపేటకు ఆటోలో వెళుతున్నారు. ఒక్కసారిగా ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న చంద్రవ్వ, లక్ష్మి, లావణ్య, ఇందు, స్వప్న, వాహన డ్రైవర్ రవితో పాటు మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న క్రమంలో చంద్రవ్వ చనిపోయింది. లక్ష్మి, లావణ్య, ఇందు, స్వప్న, రవితో పాటు మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. ఆటో డ్రైవర్ బత్తుల రవి మద్యం మత్తులో వాహనాన్ని అతి వేగంగా నడపడంతో ప్రమాదం చోటు చేసుకుం



బోల్తాపడిన ఆటో, ఇన్‌సెట్‌లో చంద్రవ్వ మృతదేహం

దని ప్రయాణికులు పేర్కొంటున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆసుపత్రికి చేరుకున్నారు. గాయాలపాలైన వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. క్షతగాత్రులను పరామర్శించారు.

తహసీల్దార్, మరో ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు

పెద్దపల్లి రూరల్, జూన్ 30: ఓ భూమి విషయంలో ఒక తహసీల్దార్‌తో పాటు మరో ఇద్దరిపై చీటింగ్, ఫోర్జరీ కేసు నమోదు అయింది. వివరాల్లోకి వెళితే పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామ మాజీ సర్పంచ్ గర్రెపల్లి విశ్వనాథంకు చెందిన సర్వే నెంబర్ 669లో గల 6 గుంటల భూమిని గ్రామానికి చెందిన మిట్టపల్లి వెంకటేషం, కారుపాకల సంపత్ కుమార్ పేరున కార్యాలయ ఇన్‌వార్డ్ నెంబర్ ఫైల్ ప్రాసెస్ లేకుండానే అక్రమంగా 2011-12లో అప్పటి తహసీల్దార్ పట్టా చేశారని కోర్టును బాధితుడు ఆశ్రయించాడు. విచారణ అనంతరం కోర్టు ఆదేశాల మేరకు ముగ్గురుపై పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో సెక్షన్ ఐపీసీ 420, 468, 471, క్రైం నంబర్ 277/2024 పెద్దపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు పెద్దపల్లి మండలంలో ఫోర్జరి, చీటింగ్ కేసు సంబంధించిన విషయాల్లో అధికారులపై కేసు నమోదు అయిన దాఖలాలు లేవు. కోర్టును ఆశ్రయించడం వల్ల తగిన న్యాయం జరిగిందని బాధితుడు హర్షం వ్యక్తం చేశాడు.

తహసీల్దార్, 12 మందిపై అట్రాసిటీ కేసు నమోదు

పెద్దపల్లి రూరల్, జూన్ 30: ఓ భూమి విషయంలో తహసీల్దార్‌తోపాటు మరో 12 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, ఫోర్జరీ, చీటింగ్ కేసు నమోదు అయింది. మండలంలోని పెద్దబొంకూర్ గ్రామ పంచాయతీ పరిధిలో చిన్నకల్వల గ్రామానికి చెందిన కలువల శంకర్‌కు సర్వే నంబర్ 478/డి లో ఎకరం ఐదు గుంటల భూమి ఉంది. అయితే ఆ భూమిలో నుంచి ఎనిమిది గుంటల భూమిని కల్వల శంకరయ్య పేరును ఇన్‌వార్డు నంబర్ ఫైల్ లేకుండానే అక్రమంగా తహసీల్దార్ పట్టా చేశారని బాధితుడు కలువల శంకర్ పేర్కొన్నాడు. పలుమార్లు కలెక్టర్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ల చుట్టూ తిరిగిన న్యాయం జరగక పోవడంతో కోర్టును ఆశ్రయించినట్లు శంకర్ తెలిపారు. కోర్టు తీర్పునివ్వడంతో పెద్దపల్లి పోలీస్ స్టేషన్‌లో తహసీల్దార్‌తో పాటు మరో 12 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి, ఫోర్జరీ, చీటింగ్ కేసు నమోదు అయినట్లు బాధితుడు శంకర్ తెలిపారు.

బైక్ పైనుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలు

కాల్వశ్రీరాంపూర్, జూన్ 30: బైక్‌పై నుంచి పడి యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గంగారం గ్రామశివారులో జరిగింది. ఆదివారం పెద్దపెల్లి మండలం మారేడుగొండకు చెందిన కమటం రమేష్(26) కాల్వ శ్రీరాంపూర్ నుండి మారేడుగొండకు బైక్‌పై వెళుతుండగా గంగారం గ్రామ శివారులో మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి పడిపోయాడు. దీంతో రమేష్ తలకు తీవ్ర గాయాలైనాయి. సంఘటనా స్థలానికి వెళ్ళిన పోలీసులు ఈ విషయంపై కేసు నమోదు చేసుకొని చావు బతుకుల్లో ఉన్న రమేష్‌ను 108 ద్వారా మెరుగైన వైద్యం కోసం పెద్దపెల్లికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

భక్తులతో కిటకిటలాడిన నరసింహుడి సన్నిధి





స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్‌లో వేచిఉన్న భక్తులు, శ్రీనివాసాచారి దంపతులను స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సీనియర్ అసిస్టెంట్

ధర్మపురి, జూన్ 30: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. సెలవు దినం తోడుగా జేష్ఠ బహుళ నవమి కావడంవల్ల లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. భక్తులు లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టికెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతిధ్వనించాయి. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్ శర్మ, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ పూజలు..

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయాన్ని రాష్ట్ర మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ ఎస్ శ్రీనివాసాచారి దంపతులు ఆదివారం సందర్శించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం మంగళ వాయిద్యాలు వెంట రాగా వేదపండితులు, అర్చకులు, సిబ్బంది వారికి స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి నరసింహమూర్తి వారిని ఆశీర్వదించారు. ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి బహుకరించి వారిని సత్కరించారు. అలాగే ఆయన అనుబంధ ఆలయాలను, అద్దాల మండపాన్ని కూడ సందర్శించారు. అంతకు ముందు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. వారి వెంట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్ ముత్యపు బుచ్చన్న, రాజ్‌కుమార్, శ్రీనివాస్, అర్చకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

● సెల్ ఫోన్‌ను భక్తుడికి అప్పగించిన ఉద్యోగి..

ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఒక భక్తుడు సెల్ ఫోన్ పోగొట్టుకోగా సిబ్బంది వెతికి ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ ద్వారా ఆదివారం బాధితుడికి అప్పగించారు. నాందేడ్‌కు చెందిన హృదయ్‌నాథ్ దూబె స్థానిక లక్ష్మీనరసింహ స్వామి దర్శనం కోసం వచ్చారు. ఉదయం దైవ దర్శనం అనంతరం ఆలయం ఆవరణలో తనకు సంబంధించిన రూ 25,000 విలువ గల సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. ఆ సెల్ ఫోన్ సెక్యూరిటీ సిబ్బందికి అభిషేకం మండపంలో దొరకడం వల్ల విచారణ జరిపి ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ భక్తుడికి అప్పగించారు. భక్తుడు ఆలయ సిబ్బందితో పాటు సీనియర్ అసిస్టెంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



చెక్ డ్యాం కట్టపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

వీణవంక, జూన్ 30: మండలంలోని రామ్మకృష్ణాపూర్‌లో వాగులో నిర్మించిన చెక్ డ్యాం కట్ట గతంలో కురిసిన భారీ వర్షలకు తెగిపోవడంతో కట్ట పూర్తిగా తెగిపోయింది. రానున్నా వర్షకాలం దృష్ట్యా కాంట్రాక్టర్ కరకట్ట నిర్మాణం చేపట్టడంతో కట్టకు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ మట్టి పోయడంతో ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌పార్మర్ భూమి లెవల్‌కు ఉండడంతో పశువులకు రైతులకు ప్రమాదకరంగా మారిందని తెలిపారు. రైతులు విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేయగా ఇరిగేషన్ అధికారుల తప్పిదంతో ప్రమాదకరంగా మారిందని తెలిపారు.

ఇసుక లారీ, ఎక్స్‌కవేటర్ పట్టివేత

తిమ్మాపూర్, జూన్ 30: మండలంలోని కొత్తపల్లి గ్రామం మానేరు వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు ఒక ఇసుక టిప్పర్, జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను గమనించిన టిప్పర్ డ్రైవర్ టిప్పర్‌ను అక్కడే వదిలేసి పారిపోగా టిప్పర్ ను జేసీబీని పట్టుకున్నట్లు డ్రైవర్ సుంచు హర్షవర్ధన్, జేసీబీ డ్రైవర్ మారపల్లి సాయి కుమార్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎల్ఎండి పోలీసులు తెలిపారు.

కానిస్టేబుల్ విధులకు ఆటంకం కల్పించిన వ్యక్తి అరెస్ట్


- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 30: పోలీస్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కల్పించడమే కాకుండా దాడికి పాల్పడిన ముస్తాబాద్ మండలంలోని నామాపూర్ తండాకు చెందిన భూక్య గురుబాబు (30) అనే వ్యక్తిని ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రటనలో తెలిపారు. నిందితునిపై గతంలో వివిధ పోలీస్‌స్టేషన్‌లలో 21 కేసులతో పాటు ఒక మర్డర్ కేసు ఉండడంతో రౌడీ షీట్ ఓపెన్ చేశామన్నారు. ఈనెల 26న రాత్రి రామలక్ష్మణపల్లి గ్రామ శివారులోని మానేరువాగులో బాబుకు చెందిన ట్రాక్టర్‌లో డ్రైవర్ ప్రశాంత్ ఇసుక నింపుకొని దుబ్బాక వైపు వెలుతున్నాడు. ఈ క్రమంలో నామాపూర్‌చెరువు కట్టపై పోలీసులు ఆ ట్రాక్టర్‌ను పట్టుకోగా ట్రాక్టర్ యజమాని బాబు అక్కడికి చేరుకొని మళ్లీ ట్రాక్టర్ సీజ్‌చేస్తారని వెంటనే ట్రాక్టర్‌ను డ్రైవర్ వద్ద నుంచి తీసుకొని తన ట్రాక్టర్‌కు అడ్డురావదడ్డని హెచ్చరిస్తూ విధుల్లో ఉన్న కానిస్టేబుల్ సత్యనారాయణను గాయపరిచి పారిపోయినట్లు ఎస్పీ తెలిపారు. అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న బాబును నామాపూర్ శివారులో అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇతనిపై ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో 14 కేసులు, తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు, వేములవాడ టౌన్, గంభీరావుపేట పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు, సిద్దిపేట జిల్లా దుబ్బాక పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు కేసులతో పాటు ఒక మర్డర్ కేసులో రౌడీ షీట్ ఓపెన్ చేశామని ఆయన తెలిపారు.

బావిలో పడిన పిల్లిని రక్షించిన అగ్నిమాపక సిబ్బంది

సిరిసిల్ల క్రైం, జూన్ 30: సిరిసిల్ల పట్టణంలోని శివాలయం సమీపంలో గల ఓ ఇంట్లోని చేదబావిలో పిల్లి పడింది. పిల్లిని రక్షించుమని ఇంటి యజమాని మోహనమూర్తి ఫైర్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే వచ్చిన అగ్నిమాపక సిబ్బంది బావిలో పడిన పిల్లిని బయటకు తీసి కాపాడారు. రెస్క్యూ చేసిన అగ్నిమాపక సిబ్బందికి ఇంటి యజమాని కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



పెగడపల్లి, జూన్ 30 : పెగడపల్లి మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన ముంజ రాజు (31) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంజ రాజు ఈ నెల 26న బతికెపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడు రాజు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

కొండ చిలువ కలకలం

● భయాందోళనలో ప్రజలు

శంకరపట్నం, జూన్ 30: శంకరపట్నం మండలంలోని కాచాపూర్‌లో ఆదివారం ఇళ్ల మధ్య కొండ చిలువ కలకలం రేపింది. కాచాపూర్ గ్రామంలోని హనుమాన్ దేవాలయ సమీపంలో మాల కాలనీకి వెళ్లే దారిలో ఆదివారం ఓ కొండ చిలువ పిల్లిని పట్టుకొని మింగుతుండగా ఓ మహిళ ప్రత్యక్షంగా చూసిన సంఘటన జరిగింది. మహిళ తన ఇంటి పక్కన ఉన్న సీసీ రోడ్ వైపు కరివేపాకు కోసం వెళ్తుండగా కొండ చిలువ పిల్లిని పట్టుకున్న ఘటన చూసి భయాదోళనకు లోనైంది. వెంటనే ఆ మహిళ కేకల వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకొని కొండ చిలువ నోట్లో నుంచి పిల్లిని విడిపించారు. పిల్లి అప్పటికే మృతి చెందింది. స్థానికులు కొండ చిలువను సమీపంలో ఉన్న గుట్టల వద్ద వదిలి పెట్టినట్లు తెలిపారు. కొండ చిలువ గ్రామంలో ఇళ్ల మధ్య కనిపించడంతో ప్రజలు భయాందోళనకు లోనవుతున్నారు.

భక్తుల మనోభావాలను గౌరవించేందుకు చర్యలు

- రాజన్న ఆలయంలో కోడెలు ఎంతో ప్రాముఖ్యం గలవి
- సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జూన్ 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారికి ఎంతో ప్రేమతో నిజ కోడెలు సమర్పించే భక్తుల మనోభావాలను గౌరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి తిప్పాపూర్ గోశాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ సందర్భంగా గోశాలలోని కోడెల స్థితిగతులను, పిచ్చి గడ్డిని, సోయాబీన్, పల్లిపిండి, తవుడుతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఓఎస్‌డీ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రాజన్న ఆలయంలోని గోశాలను సందర్శించానని అన్నారు. రాజన్న ఆలయానికి భక్తులు సమర్పించే కోడెలు ఎంతో ప్రాముఖ్యత గలవని సీఎం ప్రత్యేకంగా చెప్పడంతోనే సందర్శించినట్లు తెలిపారు. ఇప్పటికే గోశాలను ఎండోమెంట్ కమిషనర్ విజిట్ చేశారని, నాలుగు వందలు ఉండే గోశాలలో 1500 పైగా కోడెలు ఉంటున్నాయని అన్నారు. కొంత అనారోగ్యం కారణంగా కోడెలు మృతి చెందుతున్నాయన్నారు. బురద నీరు లేకుండా సీసీ రోడ్డు నిర్మాణం, కొత్త షెడ్డుల నిర్మాణాల కోసం ఆదేశాలు జారీ అయ్యాయని అన్నారు. గోశాల ఆధునికీకరణ కోసం మరిన్ని నిధులు వేచ్చిస్తున్నామని, కోడెల సంరక్షణ కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. గోశాలలోనే కోడెలను రైతులకు అందించేందుకు ప్రయత్నం జరుగుతుందని అన్నారు. గోశాలకు పర్మినెంట్‌గా వైద్యులను, సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు.





తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలను పరిశీలిస్తున్న సీఎం ఓఎస్‌డీ, ఆలయ గెస్ట్‌హౌస్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఓఎస్‌డీ, ప్రభుత్వ విప్

● ఆలయ అభివృద్ధికి సీఎం పట్టుదలతో ఉన్నారు..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

రాజన్న ఆలయాభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి పట్టుదలతో ఉన్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఐదు నెలల క్రితమే రాజన్న ఆలయం, గోశాల అభివృద్ధి కోసం రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో గతంలో వెనక్కి వెళ్లిన వీటీడీఏ నిధులు రూ. 20 కోట్లు తిరిగి తెప్పించామన్నారు. ఎన్నికల కోడ్‌తో అభివృద్ధి పనుల్లో ఆలస్యం జరిగిందని అన్నారు. రాజన్న కోడె మెక్కులు చెల్లించుకునే భక్తులు ఆరోగ్యంగా, పాలు మరిచిన, నిర్ణీత వయస్సు నిండిన కోడెలను మాత్రమే సమర్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఈఈ రాజేష్, డీఈ రఘునందన్, రావేశ్వరావు, ఏఈవో ప్రతాప నవీన్, హరికిషన్, జయకుమారి, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, సూపరింటెంట్‌లు సిరిగిరి శ్రీరాములు, తిరుపతిరావు, నటరాజ్, నాగుల మహేష్, ఎడ్ల శివసాయి తదితరులు ఉన్నారు.

● రాజన్నను దర్శించుకున్న సీఎం ఓఎస్‌డీ

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. రాజన్న దర్శనానికి వచ్చిన ఆయన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి రాజన్న ఆలయానికి విచ్చేయగా ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం స్వామి వారి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించగా ఆలయ ఈవో రామకృష్ణ రాజన్న ప్రసాదాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న నాయకులు

గంభీరావుపేట, జూన్ 30 : గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన శిరీష అనే బాలిక వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 2.50 లక్షలు ఎల్‌వోసీని ఆదివారం కుటుంబ సభ్యులకు అందజేశారు. శిరీష అనారోగ్యంతో బాధపడుతుండడంతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో సీఎం సహాయ నిధి నుంచి బాలిక వైద్యం ఖర్చులకోసం రూ.2.50 లక్షలు మంజూరు చేయించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పాపగారి రాజుగౌడ్, నాయకులు జంగం రాజులు ఎడబోయిన ప్రభాకర్, నస్రతుల్లా, శేఖర్, లచ్చయ్య ఓరుగంటి నరసింహులు స్వామి, గణేష్, ఎలక రాజు, నాంపల్లి తదితరులు ఉన్నారు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

వేములవాడ కల్చరల్, జూన్ 30 : వేములవాడ పట్టణంలోని గీత విద్యాలయం స్కూల్‌లో 1998-99 సంవత్సరం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. పాఠశాలలో చదివిన మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. గీత విద్యాలయం కరస్పాండెంట్ యాచితుల రాంప్రసాద్‌కు నివాళులు అర్పించారు. పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేష్, భాను ప్రకాష్, పూర్వ విద్యార్థులు సంపత్‌కుమార్, రామతీర్థపు మాధవి, రఫీక్, కట్కం శ్రీనివాస్, రైకనపేట క్రాంతికుమార్, కీర్తి కిషోర్, పేందర్, తిరుపతి, మధు, రాజేంద్రప్రసాద్, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

స్థానికులకు చైర్మన్ పదవి దక్కేనా?



రుద్రంగి వ్యవసాయ మార్కెట్ యార్డు

రుద్రంగి, జూన్ 30: వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్త పాలక వర్గాలకు నియమించేందుకు ప్రభుత్వ కసరత్తు చేస్తోంది. పార్లమెంట్ ఎన్నికల అనంతరం వ్యవసాయ మార్కెట్‌లకు త్వరలోనే పాలకవర్గాలను ప్రకటిస్తామని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రిజర్వేషన్లను ప్రకటించనుంది. రుద్రంగి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీని త్వరలో చైర్మన్, వైస్ చైర్మన్, కమిటీ డైరెక్టర్‌లను నియమించినుంది. రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి బీసీకి కెటాయించినట్లు సమాచారం. దీంతో పాలకవర్గం సారథ్యం వహించే చైర్మన్ పదవి కోసం అధికార పార్టీలో పోటీ నెలకొంది. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను స్థానిక కాంగ్రెస్ నేతలు ప్రసన్నం చేసుకుంటున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కోసం కాంగ్రెస్ నేతలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలో వేములవాడ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా రుద్రంగికి చెందిన ఆది శ్రీనివాస్ గెలుపొందారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత బీఆర్ఎస్ హయాంలో రుద్రంగి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను స్థానికేతరులకే మూడు సార్లు కేటాయించారు. మూడు పర్యాయాలు చైర్మన్ పదవిని చందుర్తి మండల నాయకులకు కేటాయించగా, వైస్ చైర్మన్ పదవుల్లో మాత్రం రుద్రంగికి చెందినవారు కొనసాగారు. ఈ సారి కాంగ్రెస్ ప్రభుత్వంలో రుద్రంగి నాయకులకే ప్రాధాన్యం ఇవ్వాలని స్థానిక నేతలు కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరికి చైర్మన్ పదవి ఇవ్వనున్నదో వేచిచూడాలి.

రాజన్న ఆలయ ఉద్యోగుల పదవీ విరమణ

వేములవాడ కల్చరల్, జూన్ 30: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్న పలువురు ఉద్యోగులు ఆదివారం పదవీ విరమణ పొందారు. రాజన్న ఆలయంలో ఎలక్ట్రికల్ ఏఈ శేఖర్, హార్మోనిస్ట్ రామయ్య శర్మ, జూనియర్ అసిస్టెంట్‌లు బొడుసు నర్సయ్య, శివరాజ్, స్కావెంజర్ లింగయ్య పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రామకృష్ణ పదవి విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు, అధ్యక్షుడు హరికిషన్, కూరగాయాల శ్రీనివాస్, ఈఈ రాజేష్, అరుణ్, సురేష్, శ్రీనివాస్, ఎడ్ల శివ తదితరులు ఉన్నారు.

హెడ్ కానిస్టేబుల్ చేతివాటం?

- సోషల్ మీడియాలో వీడియో వైరల్

తంగళ్లపల్లి, జూన్ 30: తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఓ హెడ్ కానిస్టేబుల్ చేతివాటం ప్రదర్శిస్తున్న వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. గత రెండు రోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వీడియోలో చీకట్లో పోలీస్ స్టేషన్ ముందు ఓ వ్యక్తి డబ్బులు ఇస్తూ మరో వ్యక్తి డబ్బులు తీసుకుంటున్నట్లు అస్పష్టంగా కనిపిస్తోంది. చీకటిగా ఉండడంతో డబ్బులు ఇస్తున్న వ్యక్తి పుచ్చుకుంటున్న వ్యక్తులతో పాటు డబ్బులు సైతం స్పష్టంగా కనబడడం లేదు. డబ్బులు పుచ్చుకుంటున్న వ్యక్తి తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్‌గా గుర్తించినట్లు మండలంలో చర్చ జరుగుతోంది.

హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోపై విచారణ చేపట్టినట్లు డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ డబ్బులు తీసుకుంటున్న సోషల్ మీడియా వీడియోపై వివరణ కోరగా సదరు హెడ్ కానిస్టేబుల్‌ను హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ వివరించారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

కొడిమ్యాల, జూన్ 30: కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ ఉంటుందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ అన్నారు. మండలంలోని నాచుపల్లికి చెందిన చిర్ర బాణయ్య కొద్ది నెలల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా టీఆర్ఎస్ సభ్యత్వం ఉండటంతో ఆదివారం పార్టీ నుంచి మంజూరైన ప్రమాద బీమా రెండు లక్షల రూపాయల చెక్‌ను కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలను కన్న బిడ్డల్లా చూసుకుంటుందన్నారు. నిత్యం ప్రతి కార్యకర్తను పార్టీ కాపాడుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణారావు, తిర్మాలాపూర్ సింగిల్ విండో చైర్మన్ రాజేందర్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, రాష్ట్ర నాయకులు మహిపాల్‌రావు, మండల నాయకులు లక్ష్మారెడ్డి, సాగర్‌రావు, సల్మాన్, స్వామి ఉన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకుడు

కొడిమ్యాల, జూన్ 30 : డాక్టరు శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకుడు బోగ రాకేష్ మొక్కలు నాటారు. చొప్పదండి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని ప్రతి బూతులో మొక్కలు నాటె కార్యక్రమాన్ని చెపట్టినట్లు ఆయన తెలిపారు.

ఊబకాయంతో ముప్పే



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

- అధిక పొట్ట.. రోగాల పుట్ట
- స్కూల్ పిల్లల్లో ఆందోళన కలిగిస్తున్న ఒబేసిటీ
- జాగ్రత్తలు పాటించకుంటే కష్టమే

అధిక పొట్ట రోగాల పుట్టని పెద్దలు చెప్పినట్లే నగరాల్లో ఎంతో మంది అధిక బరువుతో, స్థూలకాయంతో సతమతమవుతున్నారు. అనేక రోగాలతో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా బీపీ, డయాబెటిస్, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. జిల్లాలో రోజు రోజుకు ఈ సంఖ్య పెరుగుతోందని వైద్యులు చెబుతున్నారు. ఇందులో ఎక్కువ మంది పిల్లలు, యువకులే ఉన్నారు. ఇది ఆందోళనకరమైన విషయంగా అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు ఆందోళనలు వ్యక్తం చేశాయి. పెద్దవాళ్లతోపాటు బడికి వెళ్లే పిల్లల్లో కూడా ఊబకాయ బాధితులను చూసి కలవరపడే పరిస్థితి ఉంది. బొద్దుగా ఉన్న చిన్నారులను చూసి మొదట తల్లిదండ్రులు సంబరపడ్డా పెరుగుతున్న దశలో చిన్నారులకు ఏర్పడుతున్న సమస్యలు చూసి ఆందోళన చెందుతున్నారు. పెద్దలకే కాకుండా పిల్లల్లో కూడా ఒబెసిటీతో మధుమేహం, బీపీ, ఛాతీ నొప్పులు వస్తున్నాయి. పెద్దవాళ్లు వ్యాపారాలు, ఉద్యోగాల దృష్ట్యా ఒకే చోట కూర్చోవడంతో ఊబకాయం పెరిగిపోయి ప్రమాదకరంగా మారే పరిస్థితి ఏర్పడింది. పిల్లల్లో కూడా బరువు పెరగడానికి ప్రధానంగా టీవీలు, కంప్యూటర్ల ముందు ట్యాబ్‌లతో గేమ్‌లు ఆడుకోవడం, హోమ్‌వర్కుల పేరుతో గంటల తరబడి కూర్చోవడంతో చురుకుదనం లోపిస్తోంది. పిల్లలకు ఎక్కువగా ఫాస్ట్‌ఫుడ్ పెట్టడంతో కొవ్వు కూడా పెరుగుతోంది. ఉద్యోగులు కూడా హోటళ్లలో ఆహారాన్ని ఎక్కువ తీసుకోవడం కారణాలుగా మారిపోతున్నాయి.

ప్రధానంగా గమనించాల్సినవి

ఊబకాయం పెరిగిపోవడానికి కొవ్వు శాతం ఎక్కువగా ఉన్న నూనె పదార్థాలు తీసుకోవడం, అతిగా ఆహారం తినడం, శారీరక శ్రమ లేకపోవడం, టీవీ చూస్తూ ఆహారం తినడం, ఆలస్యంగా నిద్రపోవడం, రసాయనాలు కలిపిన ఆహార పదార్థాలు తినడం, చిన్నారులు, పెద్దల్లో వ్యాయామం సరిగా లేకపోవడం, కుటుంబ నేపథ్యం వంటివి కారణం.

నిర్లక్ష్యం చేస్తే కలిగే నష్టాలు

బరువు పెరుగుతున్నా పట్టించుకోకపోతే అనర్థాలు నష్టాలను చవిచూడాల్సి వస్తోంది. ఊబకాయంతో మధుమేహానికి గురి కావాల్సిన పరిస్థితి ఉంటుంది. గుండెపోటు, కీళ్ల నొప్పుల బారిన పడతారు. మూత్ర పిండాల వ్యాధులు కూడా వస్తాయి. సంతానం కలగకపోవడం, అధిక రక్తపోటు, మానసిక సమస్యలు, వచ్చే అవకాశం ఉంది. కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదంతోపాటు బ్రెయిన్ స్ట్రోక్ కూడా వచ్చే అవకాశాలున్నాయి.

వీటిని పాటించాలి

ఊబకాయం తగ్గించడానికి బెరియాట్రిక్ శస్త్ర చికిత్స విధానాలు నూతనంగా వచ్చాయి. అయితే శస్త్ర చికిత్స కంటే ముందు ఆహార నియంత్రణ, డాల్డా, నెయ్యి వస్తువులు తినడం తగ్గించడం, కాయగూరలు ఎక్కువగా తినడం, ప్రకృతి చికిత్స, వేకువ జామునే నిద్రలేవడం, వ్యాయామం చేయడం, ఏరోబిక్ వంటి ఎక్సర్‌సైజులు చేయాలి.

పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలి. టీవీ, కంప్యూటర్, వీడియోగేమ్స్ ఎక్కువ సమయం ఆడకుండా చూసుకోవాలి. టీవీ చూస్తున్నప్పుడు అన్నం, ఇతర పదార్థాలను తినిపించవద్దు. జంక్ ఫుడ్స్ ఇవ్వవద్దు. చిప్స్, స్నాక్స్ వంటివి ఇవ్వకపోవడం మంచిది. ఫ్రైడ్, బర్గర్స్, ఫాస్ట్ ఫుడ్ వంటి వాటిని ఇవ్వవద్దు. తియ్యగా ఉండే సాఫ్ట్ డ్రింక్స్, ఫ్రూట్ జ్యూస్‌తో రిఫైండ్ చేసిన ఆహార పదార్థాలను పూర్తిగా మానిపించాలి. చిన్నారులకు తల్లి పాలు ఇవ్వాలి. రోజు గంట సేపు వ్యాయామం చేసే అలవాటును కల్పించాలి.

వంశపారం పర్యంగా..

బరువు పెరగడం పిల్లల్లో సాధరణం. మధ్య వయసులోనే చాలామంది బరువు పెరుగుతారు. కొందరిలో చిన్నతనం నుంచి అధిక బరువుతో ఉంటారు. వంశ పారంపర్యంగా అధిక బరువుతో కొందరు ఉంటారు. తల్లిదండ్రులు ఇద్దరు స్థూల కాయులైతే పిల్లల్లో 73 శాతం మందికి ఇది రావచ్చు. సహజసిద్ధంగా బరువును తగ్గించుకోవడానికి వ్యాయామానికి మించింది లేదని చెప్పుకోవచ్చు. వయసుకు తగ్గ వ్యాయామాన్ని చేయడం మంచిది.



అధిక బరువుతో ఇబ్బందులు



- డాక్టర్ పి.రాజు

అధిక బరువుతో అనేక ఇబ్బందులు తలెత్తుతాయి. రోగాలు పెరగడానికి అవకాశం ఉంది. ముఖ్యంగా బీపీ, డయాబెటిస్‌కు గురవుతారు. స్థూలకాయంతో ఆయాసం పెరుగుతుంది. గుండెపోటు వచ్చే అవకాశాలు ఉంటాయి. డాక్టర్ల పర్యవేక్షణలో స్థూలకాయాన్ని తగ్గించుకోవడం మంచిది.

కేటీఆర్ వైఫల్యంతోనే నేతన్నల ఆత్మహత్యలు



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, జూన్ 30 : సిరిసిల్ల ప్రాంతం ప్రజాప్రతినిధిగా పది సంవత్సరాల పాటు మంత్రిగా ఉన్న కేటీఆర్ పెట్టిన పీడనే నేత కార్మికుల ఆత్మహత్యలు జరుగుతున్నాయని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పది సంవత్సరాలు ఈ ప్రాంతం నుంచి మంత్రిగా పని చేసిన కేటీఆర్ కోడిగుడ్డు మీద ఈకలు పీకే ఆరోపణలు చేస్తూ సిరిసిల్ల ప్రాంతంలో జరుగుతున్న నేత కార్మికుల ఆత్మహత్యలన్ని ప్రభుత్వ హత్యలే అని పరగణించ వస్తుందని ఉత్తరం రాయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికుల ఆత్మహత్యలకు ఇక్కడ ఆద్యుడు ఎవరో అన్నది మరిచినట్లు ఉన్నాడని ఎద్దేవా చేశారు. బంగారు తెలంగాణ పేరుతో తెలంగాణ ప్రజల బతుకులను ఆగం చేసి ఛిద్రం చేసి ఘనత మీదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బతుకమ్మ చీరల పేరిట సిరిసిల్ల పద్మశాలీల బతుకులను ఆగం చేశాడని ఆరోపించారు. సకాలంలో వారికి బతుకమ్మ చీరల బకాయిలు రూ. 275 కోట్లు ఇవ్వంది మీ ప్రభుత్వ ఘనతేనన్నారు. మీ ప్రభుత్వం దాదాపు రూ.7లక్షల కోట్లు అప్పులు చేస్తే కిస్తులు మా ప్రభుత్వం కడుతోందన్నారు. ఈ రోజు చిలక పలుకులు పలుకుతూ కేటీఆర్ నీతులు చెపుతూ ఉత్తరాలు రాస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడి కార్మికుల కష్టాలను చూసి మా ప్రభుత్వం రూ. 110 కోట్లు విడదల చేసిందని మిగిలిన బకాయిలు కూడా ఇవ్వడానికి మా ముఖ్యమంత్రి శ్రాయశక్తుల కృషి చేస్తున్నారని అన్నారు. నాడు ముఖ్యమంత్రి వైఎస్ఆర్ పవర్‌లూమ్స్‌కు విద్యుత్ సబ్సిడీ 50 శాతం ఇస్తే బతుకమ్మ చీరలతో బతుకులు బాగు చేస్తామని విద్యుత్ కేటగిరి 4 నుంచి 3లోకి మార్చి యూనిట్‌కి రూ.7 పెంచిన ఘనత కేటీఆర్‌దే అన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలతో పవర్‌లూంలను అమ్ముకునే పరిస్థితిలు తీసుకొచ్చింది మీరు కాదా? అని ప్రశ్నించారు. మీ హయాంలో పెద్ద సంఖ్యలో ఆత్మహత్యలు జరగాయి కాని పత్రికలు, ప్రభుత్వం దృష్టికి తీసుకురాకుండా పోలీసు పహారాలో వలస కార్మికుల మృత దేహాలను పంపించింది నిజం కాదా అన్నారు. అసైన్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఉంటూ తంగళ్లపల్లి, ముస్తాబాద్ మండలాలలో ఎవరెవరికి ప్రభుత్వ భూములను దానం చేశావో అన్ని త్వరలో బయటపెడతానని హెచ్చరించారు. తంగళ్లపల్లి మండలంలో 255 ఎకరాల ప్రభుత్వ భూమిలో 250 మందికి భూమి పంచగా అందులో కేటీఆర్ అడుగులకు మడుగులు ఒత్తే అనర్హులు ఉన్నారని ఆరోపించారు. భూములు ఉన్నవారికి భూములు ఇచ్చి అత్తసొమ్ము అల్లుడికి దానం చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరెవరికి భూములు ఇచ్చారో పేర్లతో సహా త్వరలో బయట పెడతామని, రెవెన్యూ మంత్రి, జిల్లా కలెక్టర్‌కు ఎంక్వాయిరీ చేయించాలని కోరతామన్నారు. తెలంగాణను దోచుకున్న దోపిడీ దొంగలకు మా ప్రభుత్వం గురించి మాట్లాడే నైతిక హక్కుల లేదన్నారు. ఎన్నికల ముందు వచ్చి పద్మశాలీలకు అన్యాయం జరిగిందంటూ ముఖ్యమంత్రికి ఉత్తరం రాసిన వ్యక్తి ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి అయ్యాడని అన్నారు. ఈ ప్రాంతం నుంచి కేంద్ర మంత్రి అయినందుకు కేంద్ర నుంచి రాష్ట్రంకు రావాల్సిన వాటాలను తీసుకురావాలన్నారు. ఎన్నికల సమయంలో కేటీఆర్ తప్పుడు అఫిడవిట్ ఇచ్చారని, కోర్టును ఆశ్రయించామని అన్నారు. అది తన హక్కు అన్నారు. దీనిపై కొందరు సాంఘీక మాధ్యమాలో నన్ను చంపుతానంటూ బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఖాజామొయినుద్దీన్, ప్రధాన కార్యదర్శి వెంగల అశోక్, తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, కౌన్సిలర్లు వేముల రవి, కుడికాల రవికుమార్, ఎంపీటీసీ భైరినేని రాము, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, సిరిసిల్ల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ భైరి ప్రభాకర్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, మజీద్ కమిటీ మాజీ అధ్యక్షుడు ముస్తాఫా, నాయకులు వైద్య శివప్రసాద్, వెంగళ లక్ష్మీనర్సయ్య, కళ్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

అనధికార క్రమబద్ధీకరణ సరికాదు



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

సిరిసిల్ల రూరల్, జూన్ 30: ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీల్లో అనధికార క్రమబద్ధీకరణ సరి కాదని, అన్ని ఖాళీల్లో బదిలీలను చూపించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, దూమాల రాంనాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ఆదివారం జరిగిన టీపీటీఎఫ్ సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఏ ఒక్క ప్రభుత్వ పాఠశాలను మూతపడనీయబోమని, మూసివేసిన వాటిని కూడా తెరిపిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనకు భిన్నంగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎస్‌జీటీ బదిలీల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో చాలా పాఠశాలల్లో ఖాళీలను చూపించడం లేదన్నారు. దీని కంటే ముందు జరిపిన పదోన్నతుల్లో కూడా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే నెపంతో పోస్టులను నింపలేదన్నారు. ఈ విధంగా ప్రభుత్వం దొంగచాటుగా రేషనలైజేషన్‌కు పాల్పడుతోందన్నారు. సీఎం మాటలు ప్రచారం, ప్రకటనలే పరిమితమైనయే తప్ప ఆచరణలో అమలు కావడం లేదన్నారు. గతంలో ప్రత్యేక నిబంధనలు రూపొందించి ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి కనీసం సమాచారం ఇచ్చి రేషనలైజేషన్ చేసేవారని, ప్రస్తుత బదిలీల్లో ఆయా ఖాళీలు చూపించకుండా రేషనలైజేషన్ చేస్తున్నారని అన్నారు. టీచర్ పోస్టుల అనధికార క్రమబద్ధీకరణను ఖండిస్తున్నామన్నారు. అన్ని ఖాళీలను చూపించి బదిలీల అనంతరం మిగిలినవాటిని ప్రత్యక్ష నియామకాల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు మైలారం తిరుపతి, ఎడ్ల కృష్ణచైతన్య, కోడం రాంప్రసాద్ పాల్గొన్నారు.

మన్‌కీబాత్ వీక్షించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు



వీక్షిస్తున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ టౌన్, జూన్ 30 : మూడోసారి ప్రధానికి ఎన్నికైన మొదటిసారి నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆదివారం వీక్షించారు. వేములవాడ పట్టణంలోని బీమేశ్వర గార్డెన్‌లో బీజేపీ నాయకులతో కలిసి ఆదివారం మాన్‌కీబాత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రజలు ప్రధాని మోదీ పాలనను కోరుకున్నారన్నారు. ప్రపంచ దేశాలు భారతదేశం వైపు చూస్తున్నాయంటే కారణం కేవలం ప్రధాని మోదీ అన్నారు.

కోనరావుపేట: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ 111వ ఎపిసోడ్‌ను మండల బీజేపీ, బీజేవైఎం నాయకులు, పలు గ్రామాల ప్రజలు ఆదివారం తిలకించారు. ఈ సందర్భంగా బీజేపీ బీజేవైఎం నాయకులు గోపాడి సురేందర్ రావు, గొట్టే రామచంద్రం, అంబోజ లక్ష్మీనారాయణ, మిర్యాల్‌కార్ బాలాజీ, సాయి, చందు తదితరులు ఉన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో డీఎస్‌ది కీలక పాత్ర



నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు దేవన్న

సిరిసిల్ల టౌన్, జూన్ 30 : రాష్ట్ర మాజీమంత్రి ధర్మపురి శ్రీనివాస్ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో కీలక పాత్రను పోషించారని మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవన్న అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం మున్నూరు కాపు సంఘం ఫంక్షన్ హాల్‌లో మున్నూరు కాపు సంఘం అడ్ హక్ కమిటీ ఆధ్వర్యంలో డీఎస్ మృతిపై సంతాప సభను నిర్వహించారు. డీఎస్ చిత్రపటానికి మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు దేవన్న, అడ్ హక్ కమిటీ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా దేవన్న మాట్లాడుతూ మాజీ మంత్రి డీఎస్ మరణం బాధాకరమన్నారు. మున్నూరు కాపు సామాజిక వర్గానికి ఆయన చేసిన సేవలు మరవలేమన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా తెలుగు ప్రజల అభిమానాన్ని చూరగొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అడ్‌హక్ కమిటీ కన్వీనర్ అగ్గిరాములు, సిరిసిల్ల పట్టణ సంఘం మాజీ అధ్యక్షుడు నీలి శంకర్ నాయకులు పాల్గొన్నారు.

మరమగ్గాల చప్పుళ్లతోనే నేతన్నల బతుకు



భవనంలో మాట్లాడుతున్న కూరపాటి రమేష్

సిరిసిల్ల రూరల్, జూన్ 30: వస్త్ర పరిశ్రమలకు ఖిల్లాగా పేరొందిన సిరిసిల్లలో నేతన్నలు బతకాలంటే మరమగ్గాల చప్పుళ్లు నిరంతరం నడిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకరించేందుకు సీఐటీయూ ఆధ్వర్యంలో జూలై 7 నుంచి 15 వరకు చేపట్టిన నేతన్న పోరు యాత్రలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో ఆదివారం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ, అనుబంధ సంఘాల ఐక్యవేదిక (జేఏసీ) సమావేశం పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల చేనేత, పవర్‌లూం పరిశ్రమలు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని, వాటిపై ఆధారపడి, పనిచేస్తున్న కార్మికులందరూ ఉపాధి లేక కుటుంబ పోషణ భారమై ఆర్థిక ఇబ్బందులతో ఆకలిచావులు, ఆత్మహత్యలకు గురవుతున్నారని అన్నారు. ఈ సమస్యలను పరిష్కరించి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీని వలన ఇప్పటి వరకు రాష్ట్రంలో దాదాపు పది మంది నేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఇలాంటి దారుణ పరిస్థితుల్లో చేనేత, పవర్‌లూం పరిశ్రమల్లో నెలకొన్న సంక్షోభాన్ని నివారించి సమస్యలను పరిష్కరించి ఆత్మహత్యలు జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరమగ్గాలు నడవడంతోనే నేతన్నలు బతకాలనే నినాదంతో తెలంగాణ చేనేత కార్మిక సంఘం, తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలో జూలై 7న సిరిసిల్ల నుంచి నేతన్న పోరుయాత్ర (బస్సు యాత్ర) ప్రారంభించినట్లు చెప్పారు. ఈ యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా చేనేత, పవర్‌లూం పరిశ్రమలు ఉన్నా ముఖ్య కేంద్రాల్లో పర్యటించి అక్కడ ఉన్నటువంటి సమస్యలను తెలుసుకొని పెద్ద ఎత్తున జూలై 15న చలో హైదరాబాద్ నేతన్న గర్జన సభ చేపట్టనున్నట్లు చెప్పారు. నేతన్నల ఇబ్బందులు సమస్యలను పెద్దఎత్తున ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నేతన్న పోరుయాత్రకు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ, అనుబంధ సంఘాలు మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలని కోరారు. వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల ఐక్యవేదిక సభ్యులు గోలి వెంకటరమణ, తాటి పాముల దామోదర్, అడెపు భాస్కర్, మంచె శ్రీనివాస్, వెల్దండి శంకర్, కోడం రమణ, గోనె పర్శరాములు, సిరిమల్లె సత్యం, కిషన్, నక్క దేవదాస్, లక్ష్మీనారాయణ, రాజు, అశోక్, ఎల్లయ్య, అశోక్ పాల్గొన్నారు.

బదిలీల్లో ఎస్‌జీటీ ఖాళీలను చూపించాలి



మాట్లాడుతున్న పాకాల శంకర్ గౌడ్

సిరిసిల్ల రూరల్, జూన్ 30: సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ) తత్సమాన కేటగిరీ ఉపాధ్యాయుల బదిలీల్లో ఖాళీలను చూపించడంతో పాటు బదిలీ ఆప్షన్ గడువు పొడిగించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలో ఆదివారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీనియారిటీ జాబితాల్లో తప్పులు సవరించి వేలాది పోస్టులను బ్లాక్ చేసి అప్రకటితమైన రేషనలైజేషన్ చేయడాన్ని టీఎస్ యూటీఎఫ్ ఖండిస్తోందన్నారు. రేషనలైజేషన్‌పై విధానపరమైన నిర్ణయం తీసుకోకుండా విద్యార్థుల సంఖ్యను అనుసరించి అదనపు పోస్టులను బ్లాక్ చేసిన విద్యాశాఖ అవసరమైన పాఠశాలలకు అదనపు పోస్టులను మాత్రమే కేటాయించడం లేదన్నారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌లో లేని హేతుబద్ధీకరణను మధ్యలో ఏర్పాటు చేసి కేవలం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో మాత్రమే అమలు చేసి ఉపాధ్యాయులను గందరగోళానికి గురి చేస్తోందన్నారు. కోర్టు కేసులను చూపించి వేల సంఖ్యలో ఉండే ఎస్‌జీటీలకు ఆప్షన్ గడువును ఒక్కరోజే ఇచ్చి హడావుడిగా ముగించాలని చూడడం సమంజసం కాదన్నారు. సీనియారిటీ జాబితాల్లో తప్పులను సవరించకుండా ఖాళీలను పూర్తి స్థాయిలో చూపించకుండా జరిపే బదిలీలు ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. విద్యాశాఖ అసమర్థత, అసమగ్ర విధానాలు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ఏడాదిన్నరగా సాగుతోందన్నారు. ఉపాధ్యాయుల్లో అశాంతికి అనైక్యతకు దారి తీసిందని, పాలకుల అస్తవ్యస్థ విధానాల కారణంగా రాష్ట్రంలో దశాబ్ద కాలంగా పాఠశాల విద్య పతనావస్థకు చేరువైందని అన్నారు. అదే విధానాలను ఇంకా కొనసాగిస్తే ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తొమ్మిదేళ్లుగా పదోన్నతులు, ఆరేళ్లుగా బదిలీలు లేక విద్యారంగంలో సంక్షోభం నెలకొన్న నేపథంలో పోరాడి సాధించుకున్న షెడ్యూల్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలనే ఉద్దేశంతో చిన్న చిన్న పొరపాట్లు జరిగినా సర్దుకు పోతున్నామన్నారు. కానీ సాఫ్ట్‌వేర్ లోపాలు, సర్వర్ సమస్యలకు తోడు అప్రకటిత రేషనలైజేషన్ బదిలీల ప్రక్రియ అపహాస్యం చేసిందన్నారు. అవసరమైతే రెండు రోజులు వాయిదా వేసి సమస్యలన్నీసానుకూలంగా పరిష్కరించాలని, పొరపాట్లను సవరించి పారదర్శకంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

మహానంది జాతీయ పురస్కారం అందజేత

రాయికల్, జూన్ 30: రాయికల్ పట్టణానికి చెందిన ప్రముఖవాస్తు, జ్యోతిష్య, పురోహితులు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు బ్రహ్మశ్రీ గట్టుపెల్లి రమేష్ కుమార్ ఆదివారం కరీంనగర్‌లోని కళాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మహానంది జాతీయ పురస్కా రాన్ని అందుకున్నాడు. తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా మహారాష్ట్ర) ఆధ్వర్యంలో భారతరత్న పీవీ నర్సింహారావు జయంత్యుత్సవాలు-2024ను పురస్కరిం చుకుని ఏర్పాటు చేసిన మహానంది జాతీయ పురస్కారాన్ని వాస్తు, జ్యోతిష్యం, పౌరోహిత్యంలో చేస్తున్న విశిష్ట సేవలకు గాను అందుకున్నాడు. తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ జాతీయ చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వలబోజు మోహన్ రావు పాల్గొన్నారు.